'నాకోసం వచ్చిన మనిషి మా చూపులను అనుమానించాడు'

ద్రాక్షపండ్లు పులుపు

'పుల్లగావున్నాయి.' అంది—నాకు లోపల చాలా కోపంవొచ్చింది. మామధు తెచ్చిన పండ్లను పుల్లగా వున్నాయంటుందా? చచ్చిపోయిన భర్త వస్తాడన్న నమ్మకంతో ఫోటోని పూజిస్తూ, తన యౌవనసౌభాగ్యాన్ని నిర్మూలంచేసేందుకు చీకటిముసుగులో దాగుతున్న మా అక్కకుమధులోనిమాధుర్యం ఏమి తెలుస్తుంది?

రచయిత :

'బుచ్చిబాబు'

౧

ఆమధ్య పత్రికలలో, పాశ్చాత్యదేశాలలో, స్త్రీసౌందర్యాలలోకూడా పోటీపరీక్ష పెడతారనీ, అందులో, విమర్శకులచేత, ప్రశంశింపబడి అగ్రస్థానంపొందిన వాళ్ళకి బహుమతీ యిస్తారనీ చదివాను. మన సంఘంలోకూడా, అట్లాంటి పోటీ యేదేనా పెడితే, నాకూ, మాఅక్కయ్యకూ ప్రథమ ద్వితీయ బహుమతులు తప్పకుండా వొచ్చితీరుతాయని అతిశయం లేకుండా చెప్పగలను. మా సౌందర్యం, కాలంమళ్ళీ, యవ్వనాన్ని శిథిలంచేసుకున్నవాళ్ళని సహితం, చక్కలిగింతలాగ చలింపచేస్తుంది. దానికి వొక పెద్దమనిషి (అంటే వయస్సులో నన్నమాట) రైల్లో మాతో ప్రయాణంచేస్తూ, తను దిగవలసినచోటు మర్చిపోయి, మాతోకూడాదిగి, రైలు వుద్యోగుల హేళనకి పాత్రుడైన సంగతి తార్కాణం. అందుకనే, మేం, అప్పడి నుండీ, అమావాస్యనాడేకాని ప్రయాణం చెయ్యడం మానివేశాం. ఒకసారి నేను బట్టలకొట్లో చీరె కొన్నప్పుడు, దుకాణం యజమాని చీరఖరీదు యివ్వమని అడగడం కూడా మరిచిపోయ్యాడు. నాటకాలలో కాని, రైళ్ళల్లో కాని, మమ్మల్ని టిక్కట్లు యిమ్మని యెవ్వరూ అడిగినట్లు గుర్తులేదు. అంతవరకూ యెందుకు? మాఅక్కయ్య పెళ్ళికి, మంత్రాలుచదివే బ్రాహ్మణుడు, మాఅక్కకేసిచూస్తూ, మంత్రాలుచదవడం, మా[illegible]డన్నసంగతి నమ్మకపోయినా, త[illegible]డుమంత్రాలు చదివాడన్న [illegible] తేనా నమ్మితీరాలి. ఇల్లాగే అనేక విధాలగా, మాసౌందర్యాన్ని అభినందించిన వ్యక్తులందరికీ, నాకృతజ్ఞతావందనాలు తెల్పుకున్న తరవాత, నాకథ ప్రారంభిస్తాను.

అసలు కథ యేమీ లేదు. 'కథ' అనడం బదులు,'కసి,' అని, అనడం మంచిదిలా తోస్తుంది నాకు. ఇందులో సంగతులను మార్చి, అందమూ చదివేటంతటి యింపుగా వ్రాయడం నాకు చేతకాదు. మాసౌందర్యాన్ని చూచి మోసపోయినవ్యక్తులు, నా కబుర్లను మాత్రం విశ్వసించరా అన్న ధైర్యంతో మొదలెడతాను.

మాఅక్కను పెండ్లి చేసుకున్న తర్వాత, మాబావకు, తన పెంపుడుకూతురికి వివాహంచెయ్యవలసి వొచ్చింది. మాబావ, కొంచెం లావుగా, మోటగా, భయంకరంగా కనపడినా, మాఅక్కను, చాలా సున్నితంగానూ, యెంతో మర్యాదతోకూడిన ఆప్యాయం

తోను ప్రేమించేవాడు. నాకు మా అక్కదగ్గరకంటెకూడా, మా బావ దగ్గరే చనువు. ఆయన మమ్మల్నింత ప్రేమతో చూడడానికి కారణం, మా బీదతల్లిదండ్రులు, వృద్ధులైనా, మా బావ ఉద్యోగం, హోదాలనుచూచి, ఆయన సంపదకి, మమ్మల్ని అమ్మివెయ్యడమే కారణం. నేనుచూసి వృద్ధులు, యెప్పుడూ ముక్కుతూ, మూల్గుతూ, విసుగుకుంటూ, యెందు కొచ్చిందిరాబాబు యిదంతా, అని, అనుకునేవాళ్ళే. కాని మా బావమాత్రం మొదటిభార్య పోయినందుకు, లోపలవున్న విచారాన్ని మాదగ్గఱ కక్కకపోవడం సరికదా, రోజురోజుకూ, మరింత, యావ్వనుడులాగ ప్రవర్తించటంకూడా మొదలెట్టాడు.

నేను, మాఅక్క అందరి సవతితల్లులమల్లేకాక, ఆయన పెంపుడు కూతుర్నీ, సొంతచెల్లెలులాగా చూసేవాళ్ళం. మేం, ముగ్గురం, ప్రొద్దున్న, స్నానాలగదిలోకి దూరి, బైటపడేటప్పటికి, వొక సబ్బుబిళ్ళ అరగడంకాకుండా, మా బావ, మధ్యాహ్నం నిద్రపోయి, లేవడం కూడాజరిగేది. అంత గాఢమైన స్నేహం మాముగ్గురికీ.

మా బావకూతురివివాహసందర్భంలోనే, నేనూ, మధుసూధనం మొదటిసారి కలుసుకోడం జరిగింది. మధు పెండ్లికొడుకు తమ్ముడు; చాలా చుఱుకుగామాట్లాడి, తన్ని పదిమందీ చూసేటట్టు చేసుకోనే, చమత్కారం వున్నవాడు.

అప్పుడతనికి పదునాల్గేండ్లకంటె యెక్కువ వుండవు. నేను అతనికంటె, రెండేండ్లే చిన్నదానను. ఆ సాయంత్రం, (అంటే, మనుగుడుపులకువొచ్చినప్పుడు) దాగుడుమూతాలాడుకుంటూ, నేను దాక్కుందామని వాళ్ళకి, విడిదిగా యిచ్చిన గదిలోకివెళ్లాను. సాయంత్రం ఐదుగంటలకి మొగాళ్ళంతా బైటికెళ్లేసమయం కావడంవల్ల, నేను నిర్భయంగా ఆగదిలోకి వెళ్ళగలిగాను. వెళ్ళి పైగా లోపల ఘడియకూడాపెట్టి, ప్రక్కకు తిరిగాను. మధు నిద్రపోతున్నట్లుగా పడుకున్నాడు. సిగ్గువల్ల బైటికివెడదామనిపించిందికాని, అతన్ని చూడాలనివుంది. ఆపొట్టి కాకీలాగు పొడుగుచేతులుగల చారలచొక్కా, జేబులో ముల్లులేని పెనసలు, నుదుటిమీద చిన్న గాయంపడ్డ మచ్చ, నవ్వి అల్లరిచేసే చిన్ని పెదవులు, అతికించినట్టుగావుండే కనురెప్పలు, నేను యెప్పుడూ మరిచిపోను. సగంకళ్లు తెరచి, సన్నగా నావంకచూసి పెదవులను కదల్చాడు. నేను తలుపుదగ్గఱకు వెళ్ళబోయాను.

'ఏ అమ్మాయి, యిల్లారా, యెవర్ నువ్వు?' అన్నాడు. సమాధానంచెప్పకపోయినా, అతన్ని చూసి, కొంటెగా నవ్వాను.

'మొగాళ్లున్న గదిలోకి రావొచ్చునా?' అన్నాడు, గీర్వాణంగా. నాకు కోపంవొచ్చింది.

'నువ్వు, ఆడాళ్లున్నచోట దొంగనిద్ర పోవొచ్చునా?'అన్నా. బిగ్గఱగా నవ్వాడు.

'నాయిష్టం. ఇది మాగది' అన్నాడు.

'అబ్బో, యిదీ నాయిష్టమే. ఈమేడ మాస్వంతం. మా బావది. నువ్వుయెవరవ్ అడిగేందుకు?' అన్నా ధైర్యంగా.

'జాగ్రత్త- ఎంతమాటంటే అంతమాట అనొచ్చునా? భయం భక్తీ లేకుండా డాబామీద మీరు గంతులేస్తే మాకు, యెట్లా పడుతుంది నిద్ర' అన్నాడు.

'ఇప్పుడేంనిద్ర? నీకేమన్నా జబ్బు చేసిందా? రోజూ స్కూలుపిల్లలు, బ్యాట్ బంతి ఆడుకుంటారు. నువ్విల్లాకూర్చున్నావేం? మా బావలాగ నీకేమన్నా శరీరం బరువా?' అని, నేనుకూడా నవ్వాను తెగించి. ఇంతలో, నాకోసం బైటకేకలు పెడుతున్నారు. నేను తలుపువెంపుకి నడిచాను. అతను మంచందిగి నాముందు నిలబడ్డాడు. ఇంక వెడతానన్నట్లుగా అతనివంక చూచాను.

'ఈపరికిణీగుడ్డ యెవ్వాళ్ళో కొన్నావ్?' అన్నాడు, పరికిణీ వేళ్ళతో ముట్టుగుంటూ.

'వొదులు, అదేమిటి ఎక్కడ కొంటే నీకెందుకు? మా బావ కొట్లో కొన్నాను.'

'మీబావకి బట్టలకొట్టుకూడా వుందా?' అన్నాడు.

'అదే, కాతాలకొట్టు' అని, ఘుడియమీద చై వేశాను. అస్తమించే సూర్యుడికిరణాలు కిటికీ లోంచి నాకళ్ళల్లోకి పచ్చగా పొడుస్తున్నాయి. ఆవెలుగులో వుండటంబట్టి, నీడలోవున్న అతని మొఖము నాకు సరిగా కనపడడం లేదు.

'నే కూడ మీతో ఆడనా?' అన్నాడు.

'అబ్బే, ఛీ- నువ్వు మొగాడవ్ కాదు! అన్నా.

'అవుతే వెళ్ళిపోతావా ?' అన్నాడు.

'ఏం, వొద్దా?' అన్నాను. వెంటనే నామెడకాయ వెనకాల తన చేతులను గట్టిగా చుట్టబెట్టి, నా పెదవులను, కోరికేటంతపని చేసాడు. ఒకేసారి చాలాసేపులావున్నా అనేకసార్లు తీసుకున్న మొదటిముద్దు అది.

'చెప్పనా?' అన్నా, మెల్లగా.

'వొద్దు—'

ఈ వివాహంజరిగిన నెలరోజులకి మధుసూధనం అన్నగారితో కూడా పండగకి మాయింటికొచ్చాడు. ఆసాయంత్రం నేను మా బావపొట్టమీద పడుకుని, ఆయన బొడ్డులో అగ్గిపుల్లదూరుస్తూ కూర్చున్నా.

'ఏమోయ్ మధూ, మామరదల్ని చేసుకుంటావా ? ఈజోడు బాగుంటుంది' అన్నాడు. నేను మాబావ పొట్టమీద గట్టిగా కొట్టాను.

'అబ్బ, కొట్టకే—చూడు మీదనుండిలే—అవతల, నీమొగుడు వొచ్చి కూర్చున్నాడు' అన్నాడు. నేను లేవలేదు.

'ఈఅమ్మాయి చాలా అల్లరిదండి' అన్నాడు, మధూ...

'మాభార్గవేనా— చాలాఅల్లరిదోయ్. నువ్వు మాన్పాలి, యీ అల్లరివేషాలని' అన్నాడు.

'మరే- మాన్పుతాడు' అన్నా నేను.

'తప్పు. అల్లా అల్లాఅనకూడదమ్మా' అన్నాడు. ఇంతలో మా అమ్మా, వాళ్ళమ్మా అంతా పోగయి, మాయిద్దరికీ పెండ్లిచేద్దామనీ, అప్పుడే పెండ్లయిన వాళ్ళకిందకట్టి, వేళాకోళంగా మాట్లాడం మొదలెట్టారు.

'మీఅమ్మాయికికూడా చదువుచెప్పించండి—పెద్దయింతర్వాత, వాళ్ళయిష్టమొచ్చినప్పుడు చేసుకుంటారు' అంది, వాళ్ళ అమ్మ.

'నువ్వే తప్పకుండా, చేసుగుంటానని చెప్పి, చేతులో చెయ్యి వెయ్యి' అంది మాఅమ్మ. అంతా పట్టుబడితే, అతను చెయ్యివేసాడు మాబావ నాచేతిని తీసిగళ్ళి అతనికి



టి. సి. యెస్.

ఆభరణాలంకారపుటందాన్ని తెలుపడానికి అద్దమేల ?

మెడచెయినులు

2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను, బంగారు చెయినుల కేమాత్రము తీసిపోవు. నలుపెక్కవు.

పెద్ద సైజు		చిన్న సైజు	
1 పేట 1-కి రూ.	7-0-0	1 పేట 1-కి రూ.	5-0-0
2 పేటలు ,,	14-0-0	2 పేటలు ,,	10-0-0
3 పేటలు ,,	21-0-0	వి. పి. ఖర్చులు	0-8-0
4 పేటలు ,,	28-0-0		

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు:—గుప్తా అండ్ కో, మెయిన్‌రోడ్, కాకినాడ.

అందజేసాడు. మేం యిద్దఱం సిగ్గుతో చూసుకుని నవ్వుకున్నాం.

౨

ఇది జరిగిన, నాలుగుమాసాలకే, మాబావ జబ్బుచేసి, అకస్మాత్తుగాపోయాడు. చాలాభాగం ఆస్తి మా అక్కయ్యపేర వ్రాసిపోయాడు, అందులో పెంపుడు కూతురుకికూడా, కొంతభాగం వుందనీ, వున్నవిల్లు కల్పించి మాచేత వ్రాయబడిందనీ, మాకు, మధుసూధనం తాలూకువాళ్ళకి, చాలా మనస్పర్థలు వొచ్చాయి. మాబావ పోయిన కొద్దిరోజులకే, ఆయన కట్టించి అద్దెకిచ్చిన మేడలోకి వెళ్లిపోయాము. ఆనాటినుండి మాకు మధుతాలూకువాళ్ళకి, ఉత్తర ప్రత్యుత్తరాలు, రాకపోకలు, యిచ్చిపుచ్చుకోటాలూ లేవు.

మా అక్కయ్య చాలా పతివ్రత. రోజూ ఉదయం సాయంత్రం కూడా భర్తఫోటోకి పూజచేస్తూ, ఆయన్ని స్మరించుకు విచారిస్తూ వుండేది. నేను అప్పుడప్పుడు, హేళనగా పోయినవాళ్ళకోసం, విచారం యెందుకూ అనేదాన్ని; మా అక్కయ్య కోపంవొచ్చి నాకు వొక చెంపకాయ తగిలించేది. కాని నేనుమాత్రం చచ్చిపొయ్యినవాళ్లు మనకోసం యెదురుచూస్తుంటారన్న విషయం నమ్మేదాన్ని కాదు. ప్రాణంతోవున్న మనం పోయినవాళ్లు మళ్లావొస్తారనిగాని, మనం వాళ్ళవొద్దకి చేరుకుంటామనికాని నమ్ముతున్నామా? మాఅక్కయ్య భర్తతో సుఖంగా కాపరంచేస్తున్నవాళ్ళనుగురించి నిరశించి మాట్లాడినప్పుడూ, స్త్రీలను, యితరులసౌఖ్యాలకోసం, దేహాలు అమ్ముకున్నందుకు దూషించడం చూసినప్పుడు, నాపెండ్లిమాటలు చెప్పేటప్పుడు, అదిచూపే యీర్ష్యాపూరితమైన, యీసడింపు వాక్యాలు విన్నప్పుడూ, 'నక్క- అందని ద్రాక్షపండ్ల'కథా స్మరణకువొచ్చేది.

వేసంగిసెలవలకి యేదో వూరు వెడుతూ, మధు తల్లితోకూడా మాయింట్లోదిగాడు. ధనం ఆస్తుల విషయంలో వాళ్ళకి వాళ్ళకి యేవిరోధాలున్నా, మధుసూధనంతల్లికి మేమంటే చాలా ఆదరణ.

'మీభార్గవికి పెండ్లి యీడొచ్చింది. ప్రయత్నాలుచేస్తున్నారా!' అంది మధుతల్లి.

'ఎందుకండీ, మీమధుకి యిద్దామని, యిదివఱకే వాగ్దానం చేసుగున్నాంకా. పైగా, పోయేటప్పుడు మా అల్లుడుకూడా అతనికే యిమ్మని మరీమరీ చెప్పాడు.' అంది, మాఅమ్మ.

ఆసాయంత్రం అందరూగుళ్లోకి వెళ్లారు. నేనొక్కదాన్ని కూర్చుని పాడైపోయిన హార్మోనియమ్ వాయించుగుంటున్నాను. ఎల్లా వొచ్చాడో మధు గదిలోకివొచ్చాడు.

'నే వాయిస్తా, నువ్వు పాడు' అని, వాయించడం మొదలెట్టాడు.

'ఏంపాడను? ముందర నువ్వు పాడు' అన్నా.

'ఏదో నీకొచ్చింది చిన్నప్పుడు, సత్యభామవేషం వేసావుగా స్కూలులో' అన్నాడు.

'ఇప్పుడు జ్ఞాపకంలేదు' అన్నా.

'అబ్బ పాడుదూ- మళ్లామీవాళ్లు వొచ్చేవేళయింది. ఏదీ మీరజాలగలడా' అందుకో.

'మీరజాలగలడా నాయానతి

వ్రతవిధానమునకున్ . . . ' అని మొదలెట్టాను. వాయించడం మానేసి, నన్ను తన వొళ్లోకి లాక్కొని జడను సవరిస్తూ, నుదురికి మళ్లా తన అధరాలని తగిల్చాడు. నూ నూగుమీసాలరాపిడికి, నావొళ్లు జల్లుమంది. అప్పుడే యీ ప్రపంచంలో నే నిజంగా జన్మించాను. జరిగిపోయినవన్నీ, జన్మించేందుకు పడ్డ కష్టాలే.

'నువ్వు బాగామారిపోయావు' అన్నాడు.

'అంటే?' అని వోరగా చూశాను.

'కొంచెం, యెదిగి పెద్దదానవయ్యావ్—ఇదివరకుకంటె చాలా అందంగావున్నావ్' అన్నాడు.

'నిజంగా—నే అందంగావున్నానా? మధూ! నాకు నువ్వేబాగుంటావ్' అన్నాను.

'నేనేం బాగుంటాను? నీనీడలో కూడా నుంచోడానికి అర్హత లేదు. నాకేకాదు, సౌందర్యలో నీప్రక్కనుంచోడానికి అర్హులైన, స్త్రీలను కాని, పురుషులనుకాని నేనింతవ

కూ చూడలేదు.'

ఆమాటలు వింటోంటే, నామనస్సు యెగిరిపోయి 'అందం' అన్నపాట పాడుకుంటూ బంగారపు పుష్యాలలో వూగుతున్నట్టుగా వుంది.

'ద్రాక్షపళ్లు తెచ్చావే—నాకోసమేనా?' అన్నా, యేదో మాట్లాడిద్దాంకదా అని.

'అవును నీకోసమే...' అని, వొకటి తెంపి నానోట్లో పెట్టాడు.

'మరినువ్వు తినవు. పట్టు, నోరట్టు' అని, నేకూడా వొకటి అతని నోట్లో పెట్టాను.

'ఎల్లావున్నాయి?' అన్నాడు.

'తియ్యగా, భలేగావున్నాయిలే—ఎక్కడకొన్నావ్?' అన్నా.

'నీపెదవులు వాటికంటె తీపి' అన్నాడు.

'చాల్లెద్దూ—అన్నీ వొట్టిమాటలు' అన్నా.

'కాదు. నిజం. నువ్వు దేవకన్యవు. భూలోకంలో పొరపాటున పుట్టావు... నిన్ను ముట్టుకునేందుకు కూడా, యీప్రపంచంలో యెవ్వరికి హక్కులేదు' అన్నాడు.

'పోనీ, నీకుకూడా లేదు, హక్కు' అన్నా, ఇంకా వేళాకోళంగానే.

'లేదు నీపాదాలక్రింది దుమ్ముని, నీళ్ళల్లోకలిపి, ఫేస్‌పౌడర్‌క్రింద మొహానికి రాసుకోవచ్చును' అన్నాడు. నాకు పట్టరాని నవ్వు, సంతోషం వొచ్చాయి. నాకు తెలియకుండానే అతని బుగ్గలని గట్టిగా నొక్కి అల్లరిచేసాను...

తరవాత చాలాసంగతులు మాట్లాడుకున్నాము. ఎందుకో అతను మాట్లాడేవిధంలో విచారం, భయం, అస్వతంత్రత నాకు స్ఫురిస్తున్నాయి. నాసర్వం, నాగర్వం కూడా అతనిసొత్తు చేస్తున్నా. అతనికి విచారం యెందుకు?

'నువ్వు యిదివరకంత సరదాగా లేవే?' అన్నాను.

'అది చిన్ననాడు. మనవాళ్ళ కలహాలు నువ్వు యెరుగుదువు కదా...మనకి వివాహం జరుగుతుందని...'

'వివాహంయెందుకూ?' అన్నా. నాకప్పుడు వివాహం, దాంపత్యం, సంసారం, వీటి అవసరం ప్రాముఖ్యత కనిపించలేదు. నాధైర్యంవొక్కటే. ఏకాంతంగా వున్నప్పుడు మధు నాసౌందర్యాన్ని పూజిస్తూ తనలో కలుపుకుంటాడు కదా అన్నది.

'మధూ...నిన్నుమరచి పోతానా...నాసంగతి నీకింకా తెలీయదు...'

'నువ్వు చిన్నపిల్లవు, భార్గవీ! నీకింకా తెలియదు.'

'అబ్బొ మహా నువ్వు పెద్ద కొండంతవాడవు అయినట్టు!' అన్నా. అతనికళ్ళల్లో విచారం చుక్కలరూపంగా మెరిసింది.

'చూడు, నిధీ- దానికి సాక్షి' అని, గాజుని బ్రద్దలకొట్టి పదునైన

ఆరోగ్యసుధ

సమస్త సెగ సవాయి వ్యాధులకు
20 సంవత్సరములనుండి మా అనుభవములో నున్నది.

సెగవ్యాధులు జీర్ణించుట, సవాయి వ్యాధులు జీర్ణించుట, చర్మదోషములు, మూత్రనాళమునందలిమంట, మూత్రము సన్నముగవచ్చుట, కీళ్ళనొప్పులు, ఉడుకువ్యాధులు, శుక్లనష్టము మొదలగువానికి దివ్యామృతము.

సుమారు 1 నెలకు 1 తులం రు4.

స్త్రీసుధ

స్త్రీల సమస్తవ్యాధులకు
20 సంవత్సరములనుండి మా అనుభవములోనున్నది.

మైల సరిగ కాకుండుట
ఋతుశూల
తెలుపుబట్ట
మైల అధికముగ అగుట
మొదలగు వానికి
1 నెలకు 1 తులం రు 3.

N.B:—ఇంకను 250 రకముల ఔషధములును, మరికొన్ని అనుభూత మందులును, మాచే రచింపబడిన ప్రసిద్ధములగు ఆయుర్వేదగ్రంథములును మావద్ద దొరకును.

డాక్టర్. శ్రీపాద
కృష్ణమూర్తిశాస్త్రి
బెజవాడ.

మా అనుభూతమందులకును, మా గ్రంథములకును ప్రసిద్ధమగు ప్రతిషాపులోను అడుగవలయును.

ముక్కతో నాకంఠంకింద గీచి, ఆరక్తంతో, అతని చేతిలో యేవో పిచ్చి అక్షరాలు వ్రాశాను. ఇంతలో మావాళ్లు వొచ్చిన చప్పుడైంది.

* * *

ఆ రాత్రి.

'అక్కా! ద్రాక్షపళ్లు తిను...' రెండు తింది.

'ఎట్లావున్నాయి?' అన్నాను.

'ఎవరు తెచ్చారు?' అంది.

'మధుసూధనం, ఊ' అన్నాను.

'ఊ యెందుకు నీకు తెలియనట్టు! పుల్లగావున్నాయి' అంది- నాకు లోపల చాలా కోపంవొచ్చింది. మా మధు తెచ్చిన పండ్లను పుల్లగావున్నాయంటుందా? చచ్చిపోయిన భర్త వస్తాడన్న నమ్మకంతో, ఫొటోని పూజిస్తూ, తన యౌవ్వనసౌభాగ్యాన్ని నిర్మూలంచేసేందుకు చీకటి ముసుగులో దాగుతున్న మా అక్కకు, మధులోని మాధుర్యం యేం తెలుస్తుంది?

3

తరవాత, నేను మా అక్క స్కూలుకి వెళ్ళి చదువుకోవడం మొదలెట్టాము. మా అక్కయ్యను వంచించి దాని శరీరం తమ వశంచేసుకునేందుకు చాలామంది ప్రయత్నించారు. కాని మా అక్క యెవరికీ లొంగలేదు. నాకు, మా అక్కకు సహజంగా సౌందర్యంవల్ల ఆపాదింపబడే గర్వం చాలావుంది. సూర్యాస్తమయం అవుతుంటే, ఆకాశంకేసి మావెన్నులు త్రిప్పే వాళ్లల్లోకి చేరతాము. మా అమ్మ నాన్నకూడా, మా అక్కయ్యని యేవిధంగానూ నిర్బంధించలేదు కాని మళ్లా వివాహంచేసుకోమని, అన్యధా ప్రవర్తించమనిగాని ప్రోత్సహించలేదు. మళ్లా పెళ్ళిచేసుకుంటే, మా ఆస్తిఅంతా పోతుంది. ఏమో తీరాచేసుకుంటానంటే? అంచేత మావాళ్ళు చాలా భయపడి నన్నుకూడా భాగ్యవంతుడికి అమ్మాలని లోలోపల యత్నాలు చేస్తున్నారు.

ఆసాయంత్రం క్లబ్‌లోకి టెన్నిస్ ఆటను చూడడానికి స్కూలునుంచివొస్తూ వెళ్లాము, మా అక్కకు యీ ఆట్లంటే గిట్టకపోయినా నేనే బలవంతంగా తీసికెళ్లాను. చీకటిపడి యింటికి వొస్తూంటే, వొకాయన సైకిలుదిగి మాముందు నిలబడ్డాడు.

'మీరు యెవరితాలూకు?' అని మాఅక్కయ్యని ప్రశ్నించాడు. సిగ్గుతో మాఅక్క సమాధానం చెప్పలేదు.

'మేం స్కూలులో చదువుకుంటున్నాము' అని నే సమాధానం చెప్పి, మానాన్న పేరుకూడా చెప్పి.

'మీకు పెండ్లిఅయిందా?' అన్నాడు, సైకిల్ వ్యక్తి. పెద్దపెద్ద మీసాలు లావుగా యెత్తుగా, మా బావను స్ఫురింపజేస్తాడు.

'నాభర్త గతించాడు' అంది మాఅక్క.

'అమ్మాయి! నీపేరేమిటి? నన్ను పెండ్లి చేసుకుంటావా?' అన్నాడు. చూడండి పురుషుడు స్వార్థంకోసం యెంత అసహ్యంగా ప్రవర్తించగలడో. నేను దానికి ఇంగ్లీషులో సమాధానం చెప్పా.

'దయవుంచి, అల్లాంటి తుంటరి ప్రశ్నలు వెయ్యకండి.' అన్నాం. ఐనా బిగ్గఅగానవ్వి మమ్ములను అతడు వెంబడించాడు.

ఆరాత్రి యేంసంభాషణ జరిగిందో నాకు తెలియదుకాని అప్పుడే నావివాహానికి శుభలేఖలుకూడా వ్రాయించేయత్నాలు చేస్తున్నారు మావాళ్లు. మాఅక్క నాకోసం నాతరఫున నామధుకోసం చాలా గట్టిగా వాదించింది.

'నన్ను యిట్లాచేసారు, దాన్నికూడా అట్లాచెయ్యడం మీకు సరదాగావుందా? వెధవడబ్బు మనకున్నది చాలదు? పైగా- మధు మట్టుకు బీదవాడా? నాలుగేళ్లల్లో అతను యీమాత్రం బి. ఏ, ప్యాసయి వుద్యోగం చెయ్యగలడు'అంది.

'నువ్వు ముందుముందు, పెండ్లిచేసుకుంటే?' అంది మాఅమ్మ.

'తప్పుడుకూతలు కుయ్యకు' అంది మాఅక్క. మాఅమ్మదాన్ని వొక లెంపకాయ వేసింది.

ఇల్లాగే మాతో దెబ్బలాటలాడుతూ, మా తల్లిదండ్రులు, నా పెండ్లియత్నాలన్నీ పూర్తిచేశారు. పిలుపుకీ, పేరంటానికీ మాకు మేం

తప్ప బంధువులు యెవ్వరూ లేరు. నేను మా అక్క రెండుమూడు రోజులు భోజనంకూడా చెయ్యకుండా, తలకి గుడ్డకట్టి జ్వరం అభినయించాం కాని లాభంలేకపోయింది. సన్నాయిమోతగూడా మెల్లిమెల్లిగా పెద్దదవుతూవుంది. నాకేమీ తోచక మధుకి స్కూలు అడ్రెస్‌కి వుత్తరం వ్రాశాను. అందులో కొంతభాగం యిది.

'......నావివాహం జరిగిపోతూంది, శుభలేఖ మీకు రాకపోయినా నువ్వు తప్పకుండా బయలుదేరి రావాలి. అంటే చూచి ఆనందించడానికి కాదు. నువ్వొస్తే నేను నీవెనకాలచేరి అందర్నీ ధైర్యంగా యెదిరించి పుస్తె కట్టనివ్వకుండా చెయ్యగలను. అలగ్నానికి వివాహం జరగలేదంటే మనం యెల్లకాలం ఆనందంగా ద్రాక్షపండ్లను తింటూకూర్చోవచ్చు...'

నాకు తరవాత తెలిసింది. ఈ వుత్తరాన్ని అతని తల్లిదండ్రులు చూసి వెళ్లొద్దని, పిలవని పేరంటానికి పోకూడదని నచ్చచెప్పి అతనిచేత వెళ్లననే వాగ్దానంకూడా తీసుకున్నారు. పాపం చివరికి కొందరి స్నేహితుల ప్రోత్సాహంమీద అతను మావూరువొచ్చి, మాసందులోకివొచ్చి మాయింటికి పదిగజాలదూరంలోకి వొచ్చికూడా, 'ఆ, వెళ్ళేదేమిటి పోదూ – వాళ్ళకి మనికిచ్చి పెండ్లిచెయ్యాలన్న వుబలాటంవుండాలికాని, మనంవెళ్ళి దేవురించడం మాహోదాకి లోటుకాదు? పైగా, భార్గవికంటె అందమయినవాళ్ళు చాలామంది వున్నారు...' అని, అందని ద్రాక్షపండ్లు పులుపన్నసంగతి మరిచిపోయి, ధైర్యసాహసాలను, ప్రేమను మానుషత్వాన్ని చంపుకుని మళ్లా యింటికి వెళ్ళిపోయాడు. మూడునెల్లకే మరో ఉత్తరంవ్రాశాను మధుకి స్కూల్‌ఫైనల్ ప్యాసయినపక్షాన్న, ఎఫ్.ఏ. కి మా అత్తారున్న పట్నంలోవున్న కాలేజీకి రావలసిందని, దాని సారాంశం.

తెల్లారితే నన్ను మాఅత్తారింటికి తీసుకెళ్ళడానికి నాభర్త తాలూకు చుట్టంవొకడు వొచ్చాడు. ఆరాత్రే మధుకూడా మాయింట్లోనే దిగాడు. మాఅమ్మ, దొంగరాగాలు మొదలెట్టి అంతా విధి అనీ దైవసంఘటన వుండాలనీ యేవో బూటకపు మాటలుచెప్పి, ఓదార్ప ప్రయత్నించింది.

'చాల్లెండి, భలేపనిచేశారు. పైగా విచారంకూడా యెందుకు?' అన్నాడు. నాకోసం వొచ్చినతను చాలా అనుమానపడ్డాడు. ఎన్నిసార్లు మధుకి నాకువున్న బంధుత్వాం చెప్పమన్నా అతను చెప్పలేదు.

నేనూ మధూ, వొకేబండిలో ప్రయాణంచేసాం. మేం యింటర్లో యెక్కాం అతను థర్డ్‌క్లాస్‌లో సామాన్లుపెట్టి యింజెన్‌ని పరీక్షచేస్తూ నిలబడ్డాడు. నేనే మాపెట్టెలోకిరమ్మన్నట్లుగా సవుజ్ఞ చేశాను.

రామరామా

అది ఏమికర్మమో పడుచువాళ్ళదగ్గరనుంచికూడా, ఈవురోమంటూ, మొగాన కళాకాంతలూ లేకుండా రక్తమాంసాలు క్షీణించి ఎండిపోవడమేనా? ఇంతింతలేసి వాళ్ళకు క్షయనీ, మధుమేహమనీ, నడుమునొప్పనీ, కాళ్ళతీపనీ, ఎవరినోట చూచినా ఒకటే ఆర్తనాదమూ!
జీవధాతువులు ఇంతగా క్షీణించిన యీజాతికి ఏనాటికైనా తిరిగి స్వస్వరూపజ్ఞానం గలిగి మృత్యుంజయ సాక్షాత్కారమవుతుందా? ఆర్తసంజీవనమైన

జీవని

వల్ల తప్పితే తరుణోపాయం కనుపించదు.

జీవని

కంటె అన్యధా శరణంనాస్తి అంటున్నారు వాడి తెలుసుకొన్నవారు.

వాడి చెడినవారు లేరు.

జీవని

వాడక చెడిపోయేరు,

ద్రవము 8 ఔన్సులు సీసా రు. 2-8-0
30 మాత్రలు సీసా రు. 2-8-0

మృత్యుంజయ ఫార్మసీ

బెజవాడ.

మాచూపులను అనుమానించాడు నాకోసం వొచ్చిన మనిషి.

తరవాత నెలలు గడిచిపొయ్యాయి. మధుకి నేను కనబడలేదు. మాయింటిజాడ తెలియక పిచ్చివాడిలాగు తెగతిరిగేవాడుట పాపం– నాభర్త, నాఅత్తగారువున్న యింట్లోకాకుండా నేను మాఅక్కా మాఅమ్మా, ఆవీధులోనే వేరేయింట్లో కాపరంవుంటున్నాము. రాత్రి, రోజూ నాభర్త నాకోసం వొచ్చేవాడు.

మమ్మల్ని యిట్లా వేరే వుంచడానికి కారణాలు చాలావున్నాయి. నాభర్త మొదటిభార్య తనతోనే వున్నప్పుడు, యింట్లో అత్తగారి పోరు పడలేనని గోలచేస్తే స్కూలికి పంపేవాడుట. తరవాత ఆ అమ్మాయినిగురించి చాలాపుకార్లు బయలుదేరాయి. కొంతకాలానికి, ఆపిల్ల కాలంచేసింది. కొందరు ఆత్మహత్య చేసుకుందనీ, కొందరు అత్తగారివల్లనే బలవంతంగా చంపబడిందనీ చెప్పుగుంటారు. కాని, యిందలి రహస్యం నాతో నాభర్త యెప్పుడూ చెప్పలేదు. అల్లాంటివి జరగకుండా వుండడానికే మమ్మల్ని వేరేయింట్లో వుంచడానికి కారణం.

నాకు నాభర్తంటే చాలా భయంగావుండేది. లోపల చాలా కోపంగాకూడా వుండేది. వీటిని అన్నిటినీ మించినది నాసౌందర్యాన్ని స్థూలకాయుడైన యౌవన సౌందర్యాన్ని యెట్లావుపయోగించుకోవాలో తెలియని, భర్తకి అర్పణ చేసుకుని ఆ సుఖాలలో, నే పూర్తిగా పాల్గొనకుండా పదిమందికి నన్నుగురించి, చెప్పుకోకుండా యెక్కడో చీకట్లో దాచిపెట్టడంవల్ల కల్గిన బెంగ. మా అత్తవారితాకు పిల్లాడు వొకడు కాలీజిలోనే చదువుకునేవాడు. ఒకనాడు బల్లమీదవున్న కాలేజీసంచిక తీసిచూచాను. అందులో మధురాసిన తెలుగుకథ చదివాను. నేను అంతకిపూర్వం అల్లాంటికథలు చదవలేదు. నన్నుగురించే వ్రాశాడని నాకు బాగాతెలుసు. రోజూ ఆ కథనిచదివి దానిమీద యేడ్చేదాన్ని.

౪

కొంతకాలానికి భర్త అభిమతంమీదనే నేను మా అక్కా స్కూలుకివెళ్ళి చదువుకునేవాళ్ళము. రాత్రి భోజనంచేసింతర్వాత, ప్లీడరిగారి అమ్మాయిఇంటికి చదువుకునేందుకు వెళ్ళేదాన్ని రోజూను. ఆసాయంత్రం యేడుగంటలకు నల్లచీర తెల్లరెవిక వేసుకుని చేతులో పుస్తకాలుపుచ్చుకుని వెడుతున్నా. ఎదురుగా లాంతర్ స్తంభందగ్గఱ, నావెంపూనడుస్తూ మధుసూధనం కనిపించాడు. నేను గుర్తుపట్టి వీధిలోనే అతనిని నిలబెట్టాను. పుస్తకాలను కిందకి జారవిడిచి అతని చెయ్యినిపట్టుగుని యేడవడం మొదలెట్టాను.

'తప్పు. యేడవకు. ఇది పదిమందీ నడిచేరోడ్డు...' అన్నాడు, తన రుమాలుతో నాకండ్లని తుడుస్తూ.

'జట్కా బండి తీసుకురా' అన్నాను.

'ఎక్కడకని చెప్పను?'

'ఊరుబైటకి.'

ఊరుబైట పొలాలలోకినడిచి గడ్డివామిప్రక్కన కూర్చున్నాం జరిగిన సంగతులన్నీ చెప్పాను. మధు మాట్లాడకుండా దీనంగా కూర్చున్నాడు.

'మనం యిట్లారావొచ్చునా... నీభర్తకి తెలిస్తే యెంతమోసం.' అన్నాడు.

'తప్పేమిటి? మధూ! అంతా యేకమై మనికి ద్రోహంచేశారు. దానికి యిల్లా మనం పగతీర్చుకోవాలని' అతని తలకాయని నాతొడమీద ఆనించుకున్నాను.

'తెలిస్తే?' అన్నాడు.

'పారిపోదాం' అన్నా వెంట్రుకలను నావేళ్ళకి చుట్టుగుంటూ.

'ఎక్కడికని–? మనకి డబ్బేది?'

'మీయింటికే,–మీవాళ్ళు యేమీ అనరుగా.'

'నాకు ధైర్యంలేదు. ఇక్కడనుంచి పోదాంపద.' అన్నాడు.

* * *

'అయ్యాయో, షికార్లు?' అన్నాడు నాభర్త.

'ఎందుకు అల్లా అడుగుతున్నారు?' అన్నాను. వెంటనే కాలేజీ

సంచికతీసి అందులో వొకపుటను చూపించి——

'ఈకాగితం తడిసిపోయిందే?' అన్నాడు.

'ఏమో—చాలా వింతగావుందే మీధోరణి' అన్నాను.

'నోరుముయ్' అని, నన్ను బెత్తంతో చాలదెబ్బలు కొట్టాడు.

* * *

ఇట్లాగే చాలారోజులు గడిచాయి. నాసౌందర్యాన్ని అపహరించి నాకు అన్యాయంచేస్తున్నాడని నాకు లోపల పీకేదాకా వుంది కోపం. కాని నిజానికి నాభర్తకి నామీద చాలాప్రేమ నామీద యీగవాలనివ్వడు. నాటకాలను, సినీమాలకు, మీటింగులకు తీసికెడుతూ యేదికావాలంటే అది యిస్తూ ప్రాణంతో సమానంగా చూచేవాడు. విధిగా యితనికి చెందినా శారీరకంగాగాని, ఆధ్యాత్మికంగా కాని నేను యీయనకి చెందను. ప్రతి ఆదివారమూ, సాయంత్రం యేడుగంటలకు మధు మాయింటిముందునుంచి, నాకళ్ళకి వొక్కసారి కనపడాలన్న నియామకం మాకుంది. నాభర్త క్లబ్బునుంచి తొమ్మిదింటికికాని రాడు. ఇప్పటికప్పుడే పరిస్థితులు మారాయి. నాభర్తని, నాఅక్కయ్యని కలిపి చాలామంది అనుమానపడి, పాడు లోకం చాలవదంతులేసింది. మా అక్కనుచూసి యీర్ష్యపడకుండా యెల్లావుండగలదు యీ లోకం? అంత సౌరభాన్ని అంతా రూపాన్ని యెవరికీ అప్పగించకుండా దహనంచేస్తుందా? ఇందులో చాలామంది మా అక్కకోసం ప్రయత్నించి పొందలేక పోయినవారే, ద్రాక్షపళ్ళు పులుపైనా కొయ్యడం మాన్తారా?

మాఅక్కకు పిల్లాడు జనించి పోయాడనికూడా వదంతివుంది. అందుచేత మాఅక్క, మాఅమ్మ మళ్లా మాస్వంతభవనంలోకి పోయి వొంటరిగా వుంటున్నారు. నేను నా భర్తతోనే వుంటున్నా. అది ఆదివారం.

'ఇవాళ ఆరుగంటలకి పాటకచ్చేరి—మనం తొందరగా వెళ్లాలి నువ్వు స్నానంచెయ్యి.' అన్నాడు నాభర్త.

'ఎవరు గాయకుడు?'

'ఎవరో అరవదేశస్థుడు. టిక్కట్లు వూరికేవొచ్చాయి మనకి పద' అన్నాడు.

'నాకు అరవసంగీతం యిష్టంలేదు. మీరు వెడుదురు' అన్నా.

'టిక్కట్లు వూరికే వొచ్చినప్పుడు...'

'ఐనా సరే—నాకు తలకాయనొప్పిగాకూడావుంది.'

'ఇవాళ మనపిల్లాడు పుట్టినరోజు అందుకోసమేనా వెళ్లొద్దు?' అన్నాడు.

'పిల్లాడివొంట్లో బాగుండలేదు. మీరు వెడుదురు.' అన్నాను. ఆయన వెళ్ళిపోయారు.

నేను పిల్లాడిని యెత్తుకుని దొడ్డివెంపు గుమ్మంలో నిలబడ్డాను. మధుసూధనం అటుకేసి అనుకున్న ప్రకారం వొచ్చాడు.

'చూశావా నాపిల్లాడిని? ఎవరిపోలికంటావ్?' అన్నా.

'ఏమో' అన్నాడు.

'కళ్ళు, నోరూ నీవి' అన్నా.

ప్రజారోగ్య చట్టం
మద్రాసు అసెంబ్లీలో
ఆమోదాన్ని బడసింది.
అనారోగ్యంతో
—తీసుకోనేవారు—
అంటు రోగాలతో
—కుమిలేవారూ—
వెంటనే మేల్కోకపోతే
అనేక ఇక్కట్టులకు
అడ్డంకులకు
—లోనుకాబోతారు—
కాబట్టి—తక్షణం—మీమీ
అనారోగ్యసందర్భాలలో
అశ్విన్ కుమార్ ఫార్మసీ
నర్సాపురం
వారితో సంప్రతింపు చేయండి.

'చాల్లే నీహాస్యం—దీనికేంగాని నాచదువు నెలరోజుల్లో ముగుస్తుంది. నేను మళ్లా మావూరువెళ్లిపోవాలి' అన్నాడు.

'నేకూడా, నీతోరానా?' అన్నాను.

'వొద్దు నీకింకా యేమీ తెలియదు. మనకి యెంతకాలమో అంతకాలమే ప్రాప్తి. నే మళ్లా కనపడను.' అన్నాడు.

ఇంతలో నాభర్త రావడం, దాసిపిల్లని నన్నుగురించి అడగడం అది. 'ఎవరో అబ్బాయితో మాట్లాడుతున్నారండి' అని చెప్పడం జరిగాయి.

'ఇందుకనా నువ్వు రానన్నావ్' అన్నాడు. నాకుకోపం ఆగలేదు. అందులో నేను, మధూ ఆఖరిసారి మాట్లాడుకుంటున్నాం. మా యెడబాటుప్రసంగాన్నికూడా పూర్తిగా సాగనియ్యనందుకు నాకు మింగివేద్దామన్నంత ఆగ్రహంవొచ్చింది.

'ఎవడువాడు — ఎన్నోవాడు' అని విషపునవ్వు నవ్వుతూ దండించి ప్రశ్నించాడు.

'మీబోటిగాడే వాడూనూ. నేను నిజంగా అతనికే చెందుతాను. మొదట్లో అతనికిచ్చి నన్ను వివాహంచేస్తామన్నారు. మేం చాలాస్నేహితులము. మీరు నన్ను బంధించి హింసిస్తున్నారు.' అన్నా యేడుస్తూ.

'అవుతే పిల్లాడుకూడానా...' అని యేదో అర్థంలేని వెఱ్ఱికేక పెట్టి మంచంమీద వాలిపోయారు, మూర్ఛవాడిలాగ అసలు నాభర్తకి గుండెజబ్బు, ఉబ్బసంవున్నాయని వైద్యులు చెప్పారు. ఈవార్త వినేప్పటికి ఆయన యేమీ చెయ్యలేక మతితప్పి పడిపోయారు. నేను చాలా విచారించాను. నేనీవార్త చెప్పకపోయినా ఆయన సంతోషంగా వుందురేమో!

నేను వీధులోకివెళ్ళి మధుని కేకేసాను.

'మధూ! ఆయనికి చెప్పేసాను. మంచంమీద పడిపోయాడు—డాక్టర్ని తీసుకురా, తొందరగా' అన్నాను. వైద్యుడు చెయ్యిచూసి, యేమీ భయంలేదని మందిచ్చి వెళ్ళిపోయాడు.

వీధిగదిలో నేనూ మధూ మాట్లాడుకుంటూనే వున్నాం.

'పాపం మనస్సు చెదిరిపోయింది—నేనంటే, యెంతో యిదిగా చూసేవాడు... ఆయనికి దగ్గ ఉండి సేవచెయ్యొద్దు? ఇంట్లో యెవ్వరూ లేరు కూడాను' అన్నాను.

'అవును పాపం- నువ్వు జాగ్రత్తగా, ఆయన్ని కనిపెట్టుకుని వుండు—నేను వెడతా, మళ్ళాకనిపించను' అన్నాడు.

'మధూ...' అన్నా మెల్లిగా.

'ఎందుకూ?'

'ఏమీలేదు.' ఏదో చెప్పలేక పొయ్యాను.

'మధూ, నువ్వు పెండ్లిచేసుగుంటావా?'

'ఏమో.'

'జేసుకోవొద్దు, మధూ! ఇంతకాలం వోపికపట్టినవాడవు యింకా కొంతకాలం వోపికపట్టు— తప్పకుండా దైవం మనని కలిపి తీరుతాడు.' అన్నాను. నాకేసి చూడకుండానే వెళ్ళిపోయాడు.

* * *

౨

నాలుగైదు నెలలు భర్తకి సేవ చెయ్యడంలోనే గడిచిపోయాయి. రాత్రి ఆంధ్రపత్రిక తీసి ఆయన కోసం చదవడం, తలకి అమృతాంజనం మర్దనాచెయ్యడం, కాళ్ళు పట్టడం, గంటగంటకీ ఓవల్టీన్ కాచియివ్వడం—యిది నేచేసేపని.

పత్రిక చదువుతున్నా.

'భార్గవీ.' అని పిల్చారు నా భర్త.

'ఎందుకండీ' అన్నా. నాచేతిని తీసుగుని తన పెదవులకు తగిల్చారు. నేను యివతలకి తీసుగుని ముక్కుమీద వేలు పెట్టాను.

'మీ వొంట్లో యింకా బాగుండలేదు, చాలానీరసంగా వున్నారు' అన్నాను.

'పోనీ—నాలుగు ద్రాక్షపండ్లు తెప్పించు బజారునుంచి' అన్నారు. దాసీది తెచ్చింది.

'ఎట్లావున్నాయి.' అన్నాను.

'పుల్లగావున్నాయి' అన్నారు.

'కాదు మీనోటిచేదు—చాలా

తియ్యగావున్నాయండి. ఇది చూడండి' అని నేనే నోట్లో పెట్టాను.

'ఇది బాగుంది' అని నీరసంగా భూతాకృతితో నవ్వారు.

* * *

ఇట్లాగే ఆసంవత్సరం గడిచిపోయింది. మధ్య కొన్ని రోజులు కొంచెం తగ్గినా మళ్ళీ దగ్గు తీవ్రంగా రావడం సాగించింది. అర్ధరాత్రి నేను పత్రిక విశేషాలు చదివిచెపుతున్నాను.

'ఇదొద్దు భగవద్గీత చదువు' అన్నారు.

'ఎందుకు— రేపు చదువుతాను'

'కాదు భార్గవీ! నువ్వు నా అంత్యకాలంలో చాలా బాగా సంరక్షణచేశావు. నీఋణం తీర్చుకోలేను.'

'అల్లాఅనకండి— మీరు నాయందు చూపిన ఓర్పు, దయ— వీటికంటె ఇది యెక్కువదికాదు' అన్నా.

ఆయనమాట సన్నగిలింది.

'నువ్వు, నువ్వు మనసార కోరిన వారిని చేసుకో— ఈకోరిక చెల్లిస్తేనే నాఆత్మకు శాంతి. నీకు నేచేసింది యేమీలేదు. తుదకు పిల్లాడుకూడా నా...'

మళ్ళీ మాటలేదు చాలాసేపు యేడ్చాను. నాభర్తమనస్సును వాక్కు విషయంలో ఖేదపెట్టానని నాబెంగ. ఆయన కడసారివాక్కులు పూర్తిగాలేవు. 'తుదకు పిల్లాడుకూడా...' తనకు పుట్టలేదన్న అనుమానం వెలిబుచ్చాలన్న ప్రయత్నమా? అల్లాగయితే నేవిచారించదగ్గసంగతే. పోయేముందు వొక్కసారి, పిల్లాడు ఆయనకే జన్మించాడని నమ్మేటట్టు చెపితే యెంత బాగుండివుండును. అన్నింటిని మించిన యీ అనుమానంవల్ల ఆయన యెంత ఖేదించారో పాపం! నేను ఆయనకు నిజంగా చెందినదానని ఆయన నమ్మితే యీ అనుమానానికి అవకాశం వుండకపోను. అన్నివిధాల నాపిల్లాడు భర్తసొత్తే.

* * *

మళ్లా యేడాదికి నాపిల్లాడు కూడా తండ్రిని వెదకడంకోసం అన్నట్లు కాలంచేసాడు. అంతవరకు నాకు మధుకి వుత్తరం వ్రాయడానికి మనస్సు వొప్పిందికాదు. పిల్లాడు గతించడంతోనే నామీద నాభర్తమోపిన నేరం బరువు తొలిగినట్లుగా వున్నాయి.

ఈబెంగ చల్లారగానే మధుని గురించిన విచారం యెక్కువైంది. అతను నాకోసం యింతకాలం వోపిగ పట్టగలడా? ఈపాటికి అతనికి వివాహం జరిగేవుంటే? నన్ను మరిచిపోయాడేమో? ఆఖరికి ఉత్తరం వ్రాశాను.

పదిరోజులలోనే జబాబు వొచ్చింది.

'నెలరోజులలోనే నేను ఉద్యోగంలో ప్రవేశించవలసి వుంటుంది. ఇంతవరకు నీకోసం వేచివున్నందుకు భగవంతుడు అనుగ్రహం చూపించాడు.....

మళ్లా సన్నాయిమోత మేంత్రాలగానం వినిపించాయి.

౬

ఆరాత్రి ద్రాక్షపండ్లను తెచ్చి మా అక్కయ్యకు యిచ్చాను.

'ఎట్లావున్నాయి?' అన్నాను.

'ఎవరు తెచ్చారు?' అంది.

'మన మధుసూధనం' అన్నా గర్వంగా.

'ఎప్పుడు తెచ్చినా పుల్లవి తెస్తాడేం' అంది.

నాకు చాలాకోపంవొచ్చింది. ఏప్రయత్నాలు చెయ్యకుండా గుడ్డిగా నిద్రపోతున్న భగవంతుడిని నమ్మి భర్తఫోటోని పూజిస్తూ, తన సౌందర్యాన్ని నిర్మూలంచేసుకున్న మాఅక్కకి మధులోని మాధుర్యం యెట్లా తెలుస్తుంది? ఈ ద్రాక్షపండ్లతీపి నాకు యెక్కువ అయినకొద్దీ మాఅక్కకు పులుపు యెక్కువ అవుతుంది.

ఈకథను ఆదర్శప్రాయంగా అంగీకరించమని కోరడంకోసంకాని నాలాగే ప్రవర్తించమని బోధించడానికికాని వ్రాయలేదు. నాయందు సానుభూతి చూపేవాళ్ళుంటే ఆనందిస్తాను. అల్లాకాక నన్ను దూషించి కఠినంగా విమర్శించినవారందరు, అందని ద్రాక్షపండ్లను రాళ్ళతోకొట్టి వాటిని గాయపర్చడమేకాకుండా వృక్షాన్ని సహితం నాశనంచేసినవా రవుతారు.